క్లుప్తంగా

గంగమాంబ జాతర



అలంకరణలో అమ్మవారు

ఉరవకొండ(కూడేరు): కూడేరు మండలంలోని చోళసముద్రంలో 11 ఏళ్ల తరువాత గంగమాంబ జాతర కార్యక్రమాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి విశేష అభిషేకాలు నిర్వహించి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. బంధుమిత్రులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావడంతో గ్రామం కిటకిటలాడింది.

డ్రైవర్ కుటుంబానికి ఆర్థికసాయం



నగదు అందిస్తున్న ఆటో డ్రైవర్లు

ఉరవకొండ: విడపనకల్లు మండలం కొట్టాలపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉరవకొండ పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ తిమ్మప్ప రెండు రోజుల క్రితం మృతి చెందాడు. మంగళవారం డ్రైవర్ కుటుంబానికి ఉరవకొండ ఆటో డ్రైవర్లు చేయూతనందించారు. వారు సేకరించిన రూ.28 వేల నగదును మృతుని తల్లి గౌరమ్మకు అందించి ఔదార్యం చాటుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు మల్లికార్జున, ఉపాధ్యక్షుడు ఆటోశీనా, సభ్యులు యూనిస్, రాజు, భోగేష్ పాల్గొన్నారు.

నిజ జీవిత రూపకల్పనలే కథలు



ప్రసంగిస్తున్న ప్రిన్సిపాల్ ప్రగతి

కళ్యాణదుర్గం: విద్యార్థుల నిజ జీవితంలో ఎదురయ్యే ఒడిదొడుకుల రూపకల్పనలే కథలని డాక్టర్ ప్రగతి అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కథా సాహిత్యం మీద సదస్సును తెలుగు విభాగం అధికారులు నిర్వహించారు. సదస్సుకు ప్రధాన వక్తగా హిందుపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి హాజరై జీవితంలోని వివిధ అంశాలను కథా వస్తువులుగా ఎలా మలచుకోవాలో వివరించారు. తెలుగు విభాగాధి పతి పరమేష్, అధ్యాపకులు జి.ఎల్, ఎన్.ప్రసాద్, అంజనరెడ్డి, కాంతారావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ గర్భధారణతో పశు గణాభివృద్ధి



రైతులకు అవగాహన కల్పిస్తున్న పశు వైద్యశాఖ ఉప సంచాలకుడు సుధాకర్

బెళుగుప్ప: కృత్రిమ గర్భధారణలో లింగ నిర్ధారిత వీర్యం వాడటంతో 90 శాతం ఆడదూడలతో పశు అభివృద్ధి సాధ్యమని జిల్లా పశువైద్యశాఖ ఉప సంచాలకుడు సుధాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని గంగవరం గ్రామంలో సర్పంచ్ రోజా, ఎంపీటీసీ ప్రసాద్‌తో కలసి పశు వైద్యాధికారి రమేష్ అధ్యక్షతన పాడి రైతులకు పశు విజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. ప్రధానంగా కృత్రిమ గర్భధారణ, లింగ నిర్ధారణ, దూడల యాజమాన్యంపై రైతులకు వైద్యాధికారులు అవగాహన కల్పించారు. లింగ నిర్ధారిత వీర్యం ధర రూ.1350 కాగా ప్రభుత్వం రైతులకు రూ.850 సబ్సిడీ ఇస్తోందన్నారు. అనంతరం దూడల ప్రదర్శన నిర్వహించి రైతులకు నట్టల నివారణ, కాల్షియం మందులను, ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.

కౌలుకు భూముల వేలం రేపు

వజ్రకరూరు: మండలంలోని రాగులపాడు గ్రామంలో గురువారం ఉదయం 11గంటలకు రామేశ్వరస్వామి ఆలయ ఆవరణంలో రామేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, అహోబిలేశ్వర స్వామి దేవాలయాలకు చెందిన భూములకు సంభందించి కౌలుకు వేలం ఏర్పాటు చేసినట్లు ఈఓ క్రిష్ణయ్య తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆసక్తి ఉన్న వారు రూ.1000 డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

విద్యార్థుల శ్రమదానం

ఉరవకొండ: మండలంలోని చిన్నముస్టూరు వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లే రోడ్డుకు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శ్రమదానంతో మరమ్మతులు చేశారు. కళాశాలలో జాతీయ సేవా పథకం కింద ప్రత్యేక ఎన్ఎస్ఎస్ క్యాంపు నిర్వహించారు. ప్రిన్సిపాల్ అశ్రాఫ్అలీ ప్రారంభించారు. ఈసందర్భంగా 45 మంది ఎన్ఎస్ఎస్ విద్యార్థులు రోడ్డు మీద ఉన్న గుంతలను మట్టి వేసి పూడ్చారు. సీనియర్ అధ్యాపకులు సురేశ్‌బాబు, అలీహుసేన్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ఉరవకొండ: స్థానిక కణేకల్లు క్రాస్ వద్ద అక్రమంగా తరలిస్తున్న 31 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మినీ లారీని సీజ్ చేసి, రవాణాదారుడు వెంకటేష్ నాయక్‌పై కేసు నమోదు చేశారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం

- మంత్రి కేవీ ఉషశ్రీచరణ్
- జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి అపూర్వ స్పందన



కళ్యాణదుర్గం: వర్షంలోనూ ఇందిరమ్మ కాలనీలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం/బొమ్మనహాళ్/కుందుర్పి/విడపనకల్లు: రాష్ట్ర భవిష్యత్‌తో పాటు మన పిల్లల భవిష్యత్ జగనన్నే అని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ అన్నారు. కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో మంగళవారం సాయంత్రం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భవిష్యత్ తరాల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో కులమతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ద్వారా టీడీపీ, వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాలను మంత్రి వివరించారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లను ఇంటింటికీ అతికించి ప్రభుత్వంపై ప్రజా అభిప్రాయాన్ని మంత్రి స్వయంగా అడిగి తెలుసుకున్నారు. తమ ప్రభుత్వం పేదల ప్రభుత్వం అని, గడప గడపకూ మన ప్రభుత్వంలో మాదిరిగానే మరోసారి ప్రజల వద్దకు వస్తూ వారికి అందిన లబ్ధిపై అడిగి తెలుసుకునేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు మంత్రి వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, సచివాలయాల కన్వీనర్లు అర్చన, ఆంజనేయులు, తిమ్మరాజు, రాము, కో ఆప్షన్ సభ్యుడు అఫ్జల్, నాయకులు సోమనాథ్‌రెడ్డి, గాజుల అంజి, హేమ తదితరులు పాల్గొన్నారు.

- బొమ్మనహాళ్ మండలంలోని గోనేహాళ్ గ్రామంలో ప్రజా ప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వెంకటాక్షిపతిరెడ్డి, సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు రామకృష్ణ, కోటిరెడ్డి, నాగభూషణ, కేపీ ఎర్రిస్వామి, శ్రీరాములు, స్టోర్ తిమ్మారెడ్డి, ప్రభాకర్‌స్వామి, భూమిరెడ్డి, ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- కుందుర్పి మండలంలోని జంబుగుంపల, కలిగొలిమి గ్రామాల్లో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ పాలాక్షి, ఎంపీపీ కమలమ్మ, సర్పంచ్ గంగాధర, నాయకులు మహేంద్ర, నాగరాజు, గోవిందప్ప, రంగప్ప, మాజీ ఎంపీటీసీ తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.
- విడపనకల్లు మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ కాలనీలు, గడేకల్లు సచివాలయం-2 పరిధిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు సుంకన్న, ఎంపీపీ కరణం పుష్పావతి, సర్పంచు సుశీల, కన్వీనర్ ఉమాశంకర్, హంపయ్య, ప్రసాదు అశోక్‌రెడ్డి, మాజీ సర్పంచు భీంరెడ్డి, ఎంపీటీసీ ఓబుళేసు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.
- వజ్రకరూరు మండంలోని పందికుంట, పందికుంటతండాలో చేపట్టిన జగనన్నే బా భవిష్యత్ కార్యక్రమంలో సర్పంచు ఉమామహేశ్వరి, ఎఫ్‌పీఓ చైర్మెన్ అమర్‌నాథ్, నాయకులు రత్నశేఖర్, హిమవంత్‌రాజు, వెంకట్రామిరెడ్డి, గోవిందు, ఓబుళేసు, ఎం. ర మేష్, మృత్యుంజయ, ఓబిరెడ్డి, అంగడి శ్రీనివాసులు, బోయ సురేంద్ర పాల్గొన్నారు. అలాగే కొనకొండ గ్రామ సచివాలయం-2, 3 పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు లింగరాజు, బోయ గోవిందు, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.



బొమ్మనహాళ్: గోనేహాళ్‌లో కరపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కుందుర్పి: జంబుగుంపల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న నేతలు



విడపనకల్లు: గడేకల్లులో జగనే మాభవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం



వజ్రకరూరు: పందికుంటలో జగనన్నే మాభవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్రతి కూలీకి ఉపాధి కల్పించండి

కుందుర్పి: ప్రతి కూలీకి ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీఓ నారాయణస్వామి, ఏపీఓ రామచంద్ర సూచించారు. మంగళవారం మహంతపురం గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ పరిశీలించి కూలీలకు పలు సలహాలు, సూచనలిచ్చారు. ఉపాధి పనులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సర్వసభ్య సమావేశం రేపు

శెట్టూరు: మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ఎంపీపీ లక్ష్మీదేవి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ గంగావతి మంగళవారం తెలిపారు. గత సమావేశంలో సభ దృష్టికి వచ్చిన అంశాలు, వాటి పరిష్కార వివరాలతో మండల స్థాయి అధికారులు హాజరుకావాలన్నారు. ప్రజా ప్రతినిధులు హాజరై సమస్యలపై చర్చించాలన్నారు.

స్వయం ఉపాధి కల్పించడమే ధ్యేయం

బొమ్మనహాళ్: గ్రామీణ మహిళలకు స్వయం ఉపాధి కల్పించడమే ధ్యేయమని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ యోగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలో కుట్టు మిషన్ శిక్షణపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలోని మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో కుట్టు మిషన్‌పై శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు. తమ సొంత ఖర్చులతో మహిళలకు కుట్టు మిషన్‌పై శిక్షణ కల్పిస్తామన్నారు. అందుకోసం ప్రత్యేకంగా ట్రైనర్స్‌కు కూడా నియమిస్తామనానరు. శ్రీధరఘట్ట గ్రామం నుంచి మొదటి విడతగా 44 మందిని ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో ఏపీఎం సురేఖ, సొసైటీ చైర్మన్ లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

బొమ్మనహాళ్: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద చలివేంద్రాన్ని తహసీల్దార్ శ్రీనివాసులు మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.53 కోట్ల మంజూరు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

ఉరవకొండ: నియోజకవర్గంలోని కూడేరు మీదుగా రాయదుర్గం-అనంతపురం (వయా: జయపురం, బూదిగుమ్మ, రామసాగరం) క్రాస్ రోడ్డు వరకూ దాదాపు 52 గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యార్థం పీఏబీఆర్ బ్యాక్ వాటర్ ప్రవాహం మీద హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చి రూ.53 కోట్లు మంజూరు చేశారని ఎమ్మెల్సీ వై.శివ రామిరెడ్డి తెలిపారు. మంగళవారం వజ్రకరూరు మండలం కొనకొండ్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ నియోజకవర్గంలోని బెళుగుప్ప మండలం రామసాగరం నుంచి రోడ్డు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు కూడా సీఎంకు సమర్పించామని, ఇందుకు సీఎం స్పందించి రూ.53 కోట్లు నిధులు మంజూరు చేస్తూ జీఓ విడుదల చేశారన్నారు. గతంలో పీఏబీఆర్ బ్యాక్ వాటర్‌తో 800 మీటర్ల మేర రహదారి మొత్తం మునిగిపోయేదని, దీని కారణంగా 52 గ్రామ ప్రజలకు రాయదుర్గం-అనంతపురం మధ్య రాకపోకలు నిలిచిపోయేవన్నారు. ప్రస్తుతం హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణంతో దాదాపు 25 కిలోమీటర్ల దూరం తగ్గుతుందన్నారు. తమ ప్రాంత ప్రజల ఇబ్బందులు గుర్తించి హైలెవెల్ బ్రిడ్జి మంజూరు చేసినందుకు సీఎంకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. హైలెవెల్ బ్రిడ్జి మంజూరు చేయించినందుకు ఎమ్మెల్సీ శివరామిరెడ్డికి రుణపడి ఉంటామని ఉరవకొండ నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

కాలవ సెల్ఫీలకు వైఎస్సార్‌సీపీ కౌంటర్

రాయదుర్గం: సెల్ఫీ చాలెంజ్‌ల పేరుతో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు ఆడుతున్న నాటకానికి వైఎస్సార్‌సీపీ నాయకులు భారీగా కౌంటర్ అటాక్ చేస్తున్నారు. కాలవ పాలనకు, ×కాపు₹ అభివృద్ధికి మధ్య తేడాను వివరిస్తూ సోషల్ మాధ్యమాల వేదికగా నాడు- నేడు పేరుతో పోస్టింగ్‌లు వైరల్ చేస్తున్నారు. దీంతో ఆదిలోనే హంసపాదులా కాలవ సెల్ఫీల ప్రయత్నం ఫలితం లేకుండా పోతోందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఉనికి కోసమే కాలవ ఇలాంటి నాటకాలకు తెరలేపారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఐదేళ్లు మంత్రిగా ఉండి చేసిందేమీ లేదంటూ మండిపడుతున్నారు. విప్ కాపు రామచంద్రారెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే కాలువ సెల్ఫీల గోలను తెరమీదికి తెచ్చాడంటున్నారు. రెండో సెల్ఫీకి కౌంటర్‌గా కణేకల్లు మండలం జక్కలవడికి నుంచి హనుమాపురానికి వెళ్లే రహదారి గత టీడీపీ హయాంలో కాలవ పట్టించుకోలేదని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రూ.1.50 కోట్లతో 5.50 కిలోమీటర్ల రహదారి నిర్మాణం చేపట్టారని.. మీకు కళ్లుంటే చూడండి అంటూ విమర్శలు సంధించారు. సెల్ఫీల బాగోతం ఆపకుంటే దీనికి రెట్టింపుగా టీడీపీ హయాంలో చేసిన అవినీతి, తమ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధిపై ఫ్లెక్సీలు వేయిస్తామని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు.

ఘనంగా ఆదిశంకరాచార్య జయంతి



కళ్యాణదుర్గం: వాహనంలో శంకరాచార్య చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం



రాయదుర్గంటౌన్: ఆదిశంకరాచార్యుల ఉత్సవమూర్తిని ఊరేగిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం/రాయదుర్గం టౌన్: కళ్యాణదుర్గం పట్టణంలోని కోటలో ఉన్న శృంగేరి శంకరమఠంలో మంగళవారం జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి ఘనంగా నిర్వహించారు. ఉదయం మహాన్యాస పూర్వ ఏకాదశ వార రుద్రాభిషేకం, గురుపూజ రుద్రహోమం, మహా మంగళహారతి చేపట్టారు. సాయంత్రం శంకరాచార్య చిత్రపటాన్ని గ్రామోత్సవం నిర్వహించారు. పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే రాయదుర్గం పట్టణంలోని కోటలో వెలసిన శంకరమఠంలో ఆది శంకరాచార్యుల జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి ఉత్సవమూర్తిని మేళతాళాలతో శోభయాత్ర నిర్వహించారు.

30లోగా ఈ-కేవైసీ చేయించుకోండి

కుందుర్పి: పీఎం కిసాన్, రైతు భరోసా తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలంటే రైతులు ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయ అధికారి మహేష్ సూచించారు. మంగళవారం కుందుర్పి ఆర్‌బీకేలో ఖరీఫ్ పంటల సాగు, మట్టి నమూనాల పరీక్షలు, సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై రైతులకు ఆర్‌బీకే సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈనెలాఖరులోగా ఈ-కేవైసీ చేయించుకోని రైతులు ఆయా ఆర్‌బీకేల్లో లేదా మీసేవా కేంద్రాల్లో చేయించుకోవాలన్నారు. అలాగే పొలాల్లో మట్టి పరీక్షల అనంతరం వాటి ఫలితాల మేరకు ఖరీఫ్‌లో పంటలు సాగుచేయాలన్నారు. రసాయనిక ఎరువులకు స్వస్తి పలికి సేంద్రియ పద్ధతుల్లో పంటలు సాగుచేస్తే ఆశించిన దిగుబడులు వస్తాయన్నారు. అలాగే రైతు భరోసా కేంద్రాల్లోని సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య

ఉరవకొండ రూరల్/విడపనకల్లు: ఉరవకొండ మండలంలోని నెరమెట్ల గ్రామానికి చెందిన కురుబ సిద్ధప్ప(50) మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పంటల పెట్టుబడికి బ్యాంకుల ద్వారా, ప్రైవేటు వ్యక్తులతో తెచ్చిన రూ. 6 లక్షల అప్పు తీర్చే దారి కనపడక ఇంటోనే విషగుళికలు మింగాడు. కుటుంబ సభ్యులు వెంటనే అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు వీరన్న ప్రభుత్వాస్పత్రికి వెళ్లి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే విడపనకల్లు మండలంలోని కరకముక్కల గ్రామంలో అప్పులబాధ తాళలేక రైతు షేక్షావలి ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రులు అతడికి ఆస్తితోపాటు రూ. 6 లక్షల అప్పు పంచారు. ఈ క్రమంలో ఆరు నెలల కిందట బైకు యాక్సిడెంట్‌లో కాలు విరిగింది. ఇక తనకు పెళ్లి కాదని మనస్థాపానికి గురైయ్యాడు. అప్పులు తీర్చే మార్గం కానరాక ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నైపుణ్య శిక్షణ మహిళా సాధికారతకు దోహదం



సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న చేనేత, జౌళి శాఖ ఏడీ

రాయదుర్గం రూరల్: నైపుణ్య శిక్షణ మహిళా సాధికారతకు దోహదపడుతుందని చేనేత, జౌళి శాఖ ఏడీ శ్రీరంగం అప్పాజి అన్నారు. మండలంలోని 74 ఉడేగోళం టెక్స్ టైల్ పార్క్‌లో జీన్స్ ప్యాంట్ల తయారీలో నైపుణ్యం కల్పించే దిశగా మొదటి బ్యాచ్‌లో 30 రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని మంగళవారం మేనేజర్ శివారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన తో పాటు కేటీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రఘురామమూర్తి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఏడీ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రాయదుర్గం మండలం 74 ఉడేగోళంలో 17 ఎకరాల్లో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఈ పార్క్ లో ఇప్పటి వరకూ కేవలం 5 యూనిట్లు మాత్రమే నెలకొల్పారన్నారు. నైపుణ్యం కలిగిన లేబర్లు లేకపోవడంతో డిమాండ్‌కు తగ్గ ఉత్పత్తి చేయలేక పోతున్నామని యూనిట్ల యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తుండడంతో చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో శిక్షణకు శ్రీకారం చుట్టామన్నారు. గత నెల 24వ తేదీన మొదటి బ్యాచ్ కు శిక్షణ ప్రారంభించామన్నారు. శిక్షణలో ఉచిత రవాణా ఖర్చులతో పాటు , మధ్యాహ్న భోజనం అందిస్తున్నామన్నారు. మే 1 నుంచి రెండో బ్యాచ్ కు శిక్షణ ప్రారంభిస్తామన్నారు. ప్రస్తుతం శిక్షణ పొందిన వారికి మహాలక్ష్మి ఎంటర్ ప్రైజెస్ యజమాని డీఎస్ ప్రసాద్ ఉపాధి కల్పించడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న వారికి చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఓ బసవరాజు, లెక్చరర్ విజయ్ కుమార్, గార్మెంట్స్ యూనిట్ల యజమానులు ఇబ్రహీం ఖలీలుల్లా, చమ్మా ఇబ్రహీం, ప్రసాద్, శిక్షకులు గీత, హేమంత్ పాల్గొన్నారు.

48 గంటల్లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు!



కొత్త ట్రాన్స్‌ఫార్మర్ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

కణేకల్లు: అసలే వేసవి కాలం... బోరులో నీరు పుష్కలంగా ఉన్నా ఓవర్‌లోడ్ లో ఓల్టేజీతో విద్యుత్ మోటార్ ఆడక నీళ్లురాలేని పరిస్థితి. ఈ క్రమంలో తాగునీటి సమస్య గురించి తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు వెంటనే స్పందించారు. జిల్లా విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడారు. 48 గంటల్లోనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించి... తాగునీరు సక్రమంగా వచ్చేలా చేశారు. విప్ చొరవ పట్ల సర్వత్రా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వివరాలు.. మండలంలోని యర్రగుంట గ్రామంలో ప్రజలు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌పై ఓవర్‌లోడ్ లో ఓల్టేజీ కారణంగా మోటార్ పనిచేయడం లేదు. ఈ విషయాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు కెనిగుంట రామిరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ యండ్రకాయల వన్నూరప్ప రెండ్రోజుల క్రితం ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్య పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. స్పందించిన విప్ వెంటనే జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈతో మాట్లాడారు. అధికారులు ఆఘమేఘాలపై తమ సిబ్బందిని యర్రగుంటకు పంపించి... విద్యుత్ స్తంభాలు, కేబుల్, అవసరమైన సామగ్రిని అక్కడకు తరలించారు. 48 గంటలు గడవకుండానే విద్యుత్ స్తంబాలు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులన్నీ చకచకగా అయిపోయాయి. అధికారులు కరెంటు సరఫరా కూడా ఇచ్చారు. జెడ్పీటీసీ డి.పద్మావతి, ఎంపీపీ సంధ్య, జెడ్పీ మాజీ సభ్యుడు పాటిల్ నాగిరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ యండ్రకాయల వన్నూరప్ప, స్థానిక నాయకులు కెనిగుంట రామిరెడ్డి మంగళవారం పూజ చేసి కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డి పాల్గొన్నారు. నీటి సమస్య పరిష్కారమవడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

భావనారుషీశ్వరుల జయంతి



స్వామి చిత్రటానికి పూజ వేస్తున్న పద్మశాలీయులు

రాయదుర్గం: పట్టణంలోని మార్కండేయస్వామి ఆలయంలో మంగళవారం భావనారుషీశ్వరుల జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భావనాఋషి చిత్రపటాన్ని ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అంతకుముందు పతాకావిష్కరణ, భవనారుషి భద్రావతి అమ్మవార్ల కల్యాణోత్సవం శేష వస్త్రాల వేలం చేపట్టారు. మున్సిపల్ చైర్మెన్ పోరాళ్ల శిల్ప, వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు చుంచుల నాగప్ప, పోరాళ్ల రాజు, పద్మశాలి బహుత్తమ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు ఆరవ శివప్ప, ధర్మకర్త ముకుంద, ఉపాధ్యక్షులు సోమ పాండు, వెంకటేశులు, శ్రీరాముల సిద్దప్ప, ప్రధాన కార్యదర్శి నాగప్ప, సహాయ కార్యదర్శి దేవరకొండ ప్రసాద్, కోశాధికారి రామచంద్రప్ప, ప్రచార కార్యదర్శి గురు రాఘవేంద్ర ప్రసాద్, యూత్ కమిటీ సభ్యులు, మహిళా కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సమష్టిగా కృషి చేసి మలేరియాను నివారిద్దాం



కళ్యాణదుర్గం: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



గుమ్మఘట్ట: మండల కేంద్రంలో మలేరియాపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

కళ్యాణదుర్గం/బొమ్మనహాళ్/గుమ్మఘట్ట/బ్రహ్మసముద్రం/విడపనకల్లు: అందరూ సమష్టిగా పనిచేసి మలేరియాను నివారిద్దామని ముద్దినాయనపల్లి పీహెచ్‌సీ వైద్యుడు విజయేంద్ర సూచించారు. కళ్యాణదుర్గం మండలంలోని ముద్దినాయనపల్లి పీహెచ్‌సీలో మంగళవారం ప్రపంచా మలేరియా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. జ్వరాల బారిన పడకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాత్రిపూట దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని, వేపాకు పొగ వేసుకోవాలని సూచించారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ వేణుగోపాల్‌రెడ్డి, సూపర్‌వైజర్లు సురేష్, బాబు, భాగ్యమ్మలతో పాటు పలువురు పాల్గొన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఏఎన్ఎంలు, పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే బొమ్మనహాళ్ మండలంలోని ఉద్దేహాళ్, లింగదహాళ్ గ్రామాల్లో మలేరియా దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ తిరుపాల్‌నాయక్, వైద్యాధికారిణి శ్రీలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ యుగంధర్, ఏఎన్ఎంలు గోవర్ధన, రమణ, జైనాబీ, ఎర్రమ్మ, అలివేలు, శ్రీకాంత్, ఆశావర్కర్లు పాల్గొన్నారు. గుమ్మఘట్ట మండల కేంద్రంలో నిర్వహించన ర్యాలీలో వైద్యులు రమేష్, బాలాజీనాయక్, సీహెచ్ఓ మురళీధర్, సూపర్‌వైజర్లు ఆదిబయమ్మ, జయమ్మ, రవికుమార్, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు. అలాగే బ్రహ్మసముద్రం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మలేరియా నిర్మూలన దినోత్సవంలో భాగంగా మలేరియా నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మలేరియా అధికారి డాక్టర్ అక్బర్ , మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్, సూపర్ వైజర్ రామలక్ష్మి , పీహెచ్ఎన్ మేరీ, సీహెచ్ఓ బాలాజీ , ఫార్మాసిస్ట్ రమేష్ , ల్యాబ్ అసిస్టెంట్ పవన్, సిబ్బంది పాల్గొన్నారు. విడపనకల్లు మండలంలోని పెద్దకొట్టాలపల్లి, విడపనకల్లు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరినాథ్‌రెడ్డి, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద కొట్టాలపల్లి, విడపనకల్లు ఆరోగ్య సిబ్బంది నాగశంకర్, శర్మస్వలి, విజయభారతి, ఏఎన్ఎం శ్రావణి తదితరులు పాల్గొన్నారు.